# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో 'సంజీవని ప్రాజెక్టు'ను వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన, విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**

4. **వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.**

==========================

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు నిర్వహించనున్న 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. క్రీడలు, యువ నాయకత్వం, ఆరోగ్యం, దేశ నిర్మాణం వంటి అంశాలపై యువతతో ప్రధానమంత్రి చర్చించనున్నారు. 'యువ సంవాద్'లో భాగంగా క్రీడా మౌలిక వసతులు, శిక్షణ, క్రీడా విజ్ఞానం తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చ జరగనుంది. మై భారత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.యువ నాయకత్వం, స్వచ్ఛంద సేవ, భవిష్యత్తు నైపుణ్యాలు, పౌర బాధ్యతలపై ప్రధానమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. 'నషా ముక్త్ యువ' ఉద్యమంపై కూడా యువతతో ప్రత్యేకంగా సంభాషించనున్నారు. క్రీడల ద్వారా మాదకద్రవ్యాల వ్యసనాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశ క్రీడా ప్రస్థానంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం, బలమైన 'వికసిత్ భారత్' నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయడం 'ఖేలో ఇండియా డైలాగ్' ప్రధాన లక్ష్యంగా ఉంది.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వైద్యారోగ్య సేవలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సంజీవని ప్రాజెక్టుపై అధికారులతో

ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో గణనీయమైన మార్పులు తీసుకురావచ్చని ఆయన చెప్పారు. చిత్తూరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలుతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దీనిని విజయవంతంగా అమలు చేసి, వైద్య సేవల్లో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపాలని అధికారులకు సూచించారు.

---------------------------

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన, విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. దక్షిణ భారతదేశంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి హైదరాబాద్ అత్యంత ఆసక్తికరమైన ప్రాంతంగా అంతర్జాతీయ మ్యాగజైన్ 'ది ఎకనామిస్ట్' ప్రశంసించడంపై ముఖ్యమంత్రి ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి గత ప్రభుత్వాలు వేసిన పునాదులపై భవిష్యత్ ప్రణాళికలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఎఫ్ఎస్ఐ నిబంధనల తొలగింపు, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధి వంటి చర్యలు నగర ప్రగతికి దోహదపడ్డాయని తెలిపారు. హైదరాబాద్‌ను మరింత పచ్చగా, పరిశుభ్రంగా, వేగవంతమైన రవాణా వ్యవస్థతో, క్రీడలు, సంస్కృతి, కళలు, ఆహారం, వినోదం, ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం అధిక ప్రాధ్యనత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం కోపల్లె వద్ద పాత బ్రిటిష్ కాలం నాటి వంతెన స్థానంలో నిర్మించిన నూతన వంతెనను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సభాపతి మాట్లాడుతూ.. కేవలం ఐదు నెలల్లోనే రెండు లైన్ల వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలోనే అప్రోచ్ రోడ్లతో సహా నాలుగు లైన్ల వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి.. ప్రారంభిస్తామని రఘురామకృష్ణ రాజు తెలియజేస్తూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో ఈరోజు తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చిలకలూరిపేట వద్ద ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు మరణించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

---------------------------

వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఫిబ్రవరి నుంచే అంచనా వేసి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామని చెప్పారు. జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25 వరకు రాష్ట్రంలో సాధారణం కంటే 51 శాతం తక్కువ వర్షపాతం నమోదైనా, పప్పు ధాన్యాల సాగు 23.6 శాతం పెరిగిందన్నారు. రైతులకు పంటల బీమా భరోసా కల్పించడంలోనూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి చెప్పారు. ఖరీఫ్--2025లో 19.5 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులు, ఈ ఏడాది 35.1 లక్షలకు పెరిగాయని వివరించారు.

---------------------------

ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తాగునీటికి ఇబ్బంది లేకుండా, చివరి రిజర్వాయర్ వరకు నీటిని నింపుతున్నామని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. శ్రీశైలం నుంచి రాయలసీమకు తొలి విడతగా రోజుకు 11 వేల 500 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం తొలి సంవత్సరంలోనే హంద్రీనీవా కోసం 3 వేల 870 కోట్ల రూపాయలు ఖర్చు చేసి 55 టీఎంసీల నీటిని రాయలసీమ చివరి భూములకు తరలించినట్లు మంత్రి రామానాయుడు తెలియజేస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రపంచ స్థాయి సంస్థలైన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు-జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్‌ను తొలి ఎంపికగా ఎంచుకుంటున్నాయని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో గ్లోబల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ కేవలం ఐటీ రంగానికే కాకుండా స్పోర్ట్స్ టెక్నాలజీ, మీడియా, హాస్పిటాలిటీ, క్యాపిటల్ మార్కెట్లు, ట్రేడింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో పెట్టుబడులకు కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో గత సంవత్సరంలో 75 జీసీసీలు ఏర్పాటయ్యాయని, వచ్చే ఏడాది నాటికి మరో వంద జీసీసీలను రాష్ట్రానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

---------------------------

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని గోరంట్ల పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చేపట్టిన పైపులైన్ పనులను ఆమె నిన్న అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం, రుతుపవన ద్రోణి విస్తరించి ఉన్నట్లు అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ వెల్లడించారు.

మరో వైపు తెలంగాణలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

====================